క్లుప్తంగా

అక్రమ నిర్మాణాలను తొలగించాలి



నర్సంపేట : పట్టణంలోని 18వ వార్డులో నల్లాలను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులు వెంటనే తొలగించాలని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పట్టణంలోని సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ పనులు నడుస్తున్న సందర్భంలో అక్రమ నిర్మాణాలతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ రాజేందర్, మున్సిపల్ ఏఈ, తదితరులు పాల్గొన్నారు.

రైతుల మధ్య వాగ్వాదం

ఖానాపురం : మండలంలోని ఐనపల్లి శివారులో రైతుల మధ్య వాగ్వాదం శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. ఐనపల్లి శివారులోని సంగెం కాల్వ ధర్మరావుపేట చివరి ఆయకట్టుకు నీరు వెళ్తుండగా అదే కాల్వ నుంచి ధర్మరావుపేటకు నీరు వెళ్లాల్సి ఉంది. సంగెం కాలక్వకు చిన్న మోరీ ఉండటంతో నీరు రాకపోతుండడంతో కొందరు రైతులు పాత మోరీలను తొలగించి పెద్ద మోరీ ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలిసి కొందరు రైతులు అక్కడికి చేరుకుని పాత మోరీలు ఎలా తొలగిస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో రైతుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి రైతులను అక్కడి నుంచి పంపించారు.

ఫిబ్రవరి 3న లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల సభ



పర్వతగిరి : హైదరాబాద్‌లో ఫిబ్రవరి 3న మాదిగ ఉప కులాల జేఏసీ ఆధ్వర్యంలో లక్ష డప్పులు, వెయ్యి గొంతుకల సభ నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు బిర్రు మహేందర్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ, ఉప కులాల నాయకులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు బరిగెల బాబు, నాయకులు చిన్నపాక శ్రీనివాస్, జంగిలి బాబు, మాసాని గోపాల్, జిల్లా ధర్మయ్య, జిల్లా కనకయ్య, మాసాని యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 22 నుంచి నాటక పోటీలు

వర్ధన్నపేట : మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో 2025 ఫిబ్రవరి 22 నుంచి 26 వరకు 51వ రాష్ట్రస్థాయి ఆహ్వాన నాటక పోటీలు నిర్వహిస్తామని అధ్యక్షుడు మహ్మద్ అఫ్సర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు మహాశివరాత్రి నాడు బహుమతి ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. ప్రముఖ రంగస్థల, సినీ కళాకారులు పాల్గొంటారని వివరించారు. ముగింపు రోజు జానపద, పౌరాణిక, దేశభక్తి ప్రదర్శనలు ఇవ్వాలనుకునే ఔత్సాహికులు సాంస్కృతిక కార్యదర్శి పెద్దూరి సంజీవరావును సెల్ నంబర్ 942642301లో సంప్రదించాలని కోరారు.

పరామర్శ



పర్వతగిరి : మండలంలోని ఏనుగల్ కారోబార్ తక్కళ్లపల్లి వెంకటేశ్వర్లును అతడి తల్లి కాంతమ్మ ఇటీవల మృతి చెందిన క్రమంలో కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. తొలుత కాంతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బోయినపల్లి యుగేందర్‌రావు, బోయినపల్లి దేవేందర్‌రావు, గుండారపు సతీశ్‌రావు, నల్లపు అశోక్, దుడ్డు మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యూత్ నాయకుడికి..

సంగెం : మండలంలోని కాట్రపల్లికి చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకుడు చింతిరెడ్డి భరత్‌రెడ్డిని అతడి తండ్రి మాధవరెడ్డి ఇటీవల చనిపోయిన నేపథ్యంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. తొలుత మాధవరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ధర్మారెడ్డి మాట్లాడారు. పార్టీ కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, పసునూరి సారంగపాణి, దొనికెల మల్లయ్య, సుదర్శన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఎస్సారెస్పీ బ్రిడ్జి

- ప్రధాన కాల్వకు పొంచి ఉన్న ముప్పు
- పాదచారులు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ యూటీ పాత్‌వే పక్కన ఏర్పడిన గొయ్యి

సంగెం : మండలంలోని కాట్రపల్లి గ్రామ శివారులోని ఎస్సారెస్పీ బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. అనేక ఏళ్ల తరబడిగా ప్రభుత్వం మరమ్మతు చేయించకపోవడంతో ఎస్సారెస్పీ ప్రధాన కాల్వకు ఇరువైపులా ఉన్న లైనింగ్ పలు చోట్ల ధ్వంసం అయ్యింది. కాట్రపల్లి చెరువు మత్తడి నీరు, ఇతర వరద నీరు ఎల్గూర్‌రంగంపేట చెరువులోకి వెళ్లే యూటీ వద్ద ఎడమ, పడమర వైపుల నుంచి తూర్పు దిశగా ప్రవహించేందుకు నిర్మించిన పాత్‌వే బ్రిడ్జిలకు ఇరువైపులా ఉన్న మొరం వర్షపు నీటి వరద తాకిడికి కొట్టుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా కాట్రపల్లికి చెందిన రైతు రెడ్డి ద్విచక్ర వాహనంపై నుంచి పడి తీవ్ర గాయాలయ్యాడు. వాహనం దెబ్బతిన్నది. జనవరి మొదటి వారం నుంచి కెనాల్‌లోకి నీరు వచ్చే అవకాశం ఉన్న క్రమంలో అంతకు ముందే గొయ్యిలు పూడ్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో కాల్వ నీటి ధాటికి మరింత కోతకు గురై ప్రధాన కాల్వకు గండి పడే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే కాల్వ పరిస్థితి ఇంత అధ్వాన్నంగా తయారైందన్న వ్యాఖ్యలు వినవస్తున్నాయి. ఇకనైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి పాత్‌వే వద్ద ఏర్పడిన గొయ్యిలను పూడ్చడంతోపాటు ఇరువైపులా ధ్వంసం అయిన లైనింగ్‌కు మరమ్మతు పనులు చేయించాల్సి ఉంది. లేకపోతే ప్రధాన కాల్వకు గండి పడితే ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.



దెబ్బతిన్న ఎస్సారెస్పీ ప్రధాన కాల్వ లైనింగ్

నిత్యం ఇబ్బందులు

కాల్వ ఎడమ వైపు యూటీకి అవతలి వైపునకు, కాల్వ కుడివైపునకు ఉన్న వ్యవసాయ భూములకు రైతులు, కూలీలు రాకపోకలు సాగించడం పరిపాటి. ఇరువైపుల పాత్‌వే బ్రిడ్జిల ప్రారంభంలో వర్షపు వరద నీటి ధాటికి భారీ గొయ్యిలు ఏర్పడి పాదచారులు, ద్విచక్ర వాహనదార్లు రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. కాల్వలోకి నీటి ప్రవాహం వస్తే తెగే ప్రమాదం ఉంది.

\- చింతిరెడ్డి వెంకట్‌రెడ్డి, రైతు

మరమ్మతు చేయిస్తాం

కాల్వ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం. గండి పడే అవకాశం, ఇతర సమస్యలను పరిశీలిస్తాం. సమస్య మా దృష్టికి రాలేదు. త్వరలో పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాం. మరమ్మతులు చేయించడానికి అవసరమైన ప్రతిపాదనలు, ఎస్టిమేషన్ రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే మరమ్మతు పనులు చేపడతాం.

\- వేణుగోపాల్, ఏఈ, ఎస్సారెస్పీ

మున్సిపాలిటీగా ఉన్నతీకరణ ఖాయం

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

నెక్కొండ : నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ఉన్నతీకరించడం ఖాయమని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ ఏర్పాటు ప్రక్రియ తెలియకుండానే మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఉపాధి హామీ పథకం కేవలం గ్రామీణ ప్రాంతాల కోసం ఏర్పాటు చేసిందన్న విషయం తెలిసీ ఉపాధి హామీ పథకంతో కూడిన మున్సిపాలిటీగా ఉన్నతీకరణను డిమాండ్ చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని విమర్శించడం మాజీ ఎమ్మెల్యేకు సరికాదన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ నుంచి అమీన్‌పేట వరకు, నెక్కొండ నుంచి చింత నెక్కొండ క్రాస్ రోడ్డు వరకు డివైడర్‌తో కూడిన సెంట్రల్ లైటింగ్ రోడ్ల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని చెప్పారు. నెక్కొండ నుంచి పత్తిపాక మీదుగా సాయిరెడ్డిపల్లికి డబుల్ రోడ్డు పనులు త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. నెక్కొండ నుంచి ఇంటికన్నె వరకు డబుల్ రోడ్డు పనులకు త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి కానుందని వివరించారు. మరో నాలుగేళ్లలో నర్సంపేట నియోజకవర్గ రూపురేఖలు మారనున్నాయని స్పష్టం చేశారు. సమావేశంలో రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బొమ్మెరబోయిన రమేశ్, రావుల మహిపాల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగం ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పాపన్న విగ్రహావిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి

రాయపర్తి : మండలంలోని మైలారంలో ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న విగ్రహాన్ని త్వరలోనే ఆవిష్కరిస్తామని గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి తెలిపారు. ఆ విగ్రహం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వాయి పాపన్న బహుజనుల కోసం పోరాడిన వీరుడని కీర్తించారు. దాతల సహకారంతో పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయగా అడ్డుకోవాలని చూస్తున్నారని తెలిపారు. గౌడ కులస్తులను ఏకతాటి మీదకు తీసుకొచ్చి త్వరలో విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు పట్టాపురం ఏకాంతం, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు రంగు కుమార్, రాంబాబు, సంతోశ్, సారయ్య, వెంకటేశ్వర్లు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కోల కొమురయ్య, ఉపాధ్యక్షుడు జనగాం శ్రీనివాస్, కార్యదర్శి కోల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



ఖానాపురం : సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

ఖానాపురం : మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గ్రామ పంచాయతీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఉస్మాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు శుక్రవారం సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్మాన్ మాట్లాడారు. కార్మికుల కనీస వేతనం రూ.26 వేలకు పెంచి అమలు చేయాలని, వేతన బకాయిలు విడుదల చేయాలని, జీఓ నంబర్ 51ని రద్దు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ చేశారు. కార్యక్రమంలో కార్మికులు వీరన్న, భిక్షపతి, విజయ్‌కుమార్, వెంకటమ్మ, శాంతమ్మ, యాకుబి, మాణిక్యం, కుమారస్వామి, భిక్షపతి, రవీందర్, ప్రసన్న, పాపయ్య, శైలజ, కవిత, కనకయ్య, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసనలో పంచాయతీ కార్మికుల సంఘం జేఏసీ మండల అధ్యక్షుడు పోశాల రమేశ్ మాట్లాడారు. పంచాయతీ సిబ్బంది వేతనాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, పంచాయతీ సిబ్బందిని 2వ పీఆర్‌సీ పరిధిలోకి తీసుకురావాలని, జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, పంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన అంశాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది వల్లెం సుదన్‌రెడ్డి, నరేందర్, సుమన్, గణేశ్, వెంకటేశ్వర్లు, రవి, దశరథం, రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో దివ్య పడిపూజ



పుష్పాభిషేకం చేస్తున్న అర్చకులు, భక్తులు

నర్సంపేట : పట్టణంలోని శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్ గుప్తా ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ శ్రీమాన్ జి.పద్మనాభన్ నంబూద్రి అయ్యప్ప స్వామికి ముగింపు దివ్య పడిపూజ, పుష్పాభిషేకం శుక్రవారం నిర్వహించారు. గొట్టపర్తి త్రివేణి రాజేందర్, మానస మధు, ఉమాదేవి సోమశేఖర్, శైలజ శివకుమార్ దంపతులు అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం, దివ్యపడి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ మాధవశంకర్ మాట్లాడారు. ఆలయంలో 24 ఏళ్లుగా మహా అన్నదాన ప్రసాద వితరణ, మండల పూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేశ్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్‌రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, ఇరుకుల్ల వీరలింగ, దోమకుంట్ల సదానందం, వంగేటి గోవర్ధన్, మాలే రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక



నర్సంపేట : నియామక పత్రాలు ఇస్తున్న విఘ్నేశ్



చెన్నారావుపేట: నియామక పత్రం ఇస్తున్న అశోక్

నర్సంపేట : పట్టణంలో 175, 176, 159వ బీజేపీ బూత్ కమిటీలకు అధ్యక్షులుగా బూర్గు సాయిరాజ్ గౌడ్, చిలుక కుమారస్వామి, పోలు సత్యం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ ఆఫీసర్, సహ ఎన్నికల ఇన్‌చార్జ్ విఘ్నేశ్ గౌడ్, సీనియర్ నాయకుడు సత్యనారాయణ శుక్రవారం నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. పార్టీని బలోపేతానికి కమిటీలు దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల రాము, పట్టణ ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజు, గూడూరు సందీప్, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని 203వ బూత్‌కు ఎదురబోయిన వీరేంద్రనాథ్, 206వ బూత్‌కు బొల్లెపల్లి శ్రీధర్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. వారికి మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి తడుక అశోక్, కోరిటర్నింగ్ అధికారి ఎర్ర రాజు, బీజేపీ మండల అధ్యక్షుడు దుంక దువ్వ రంజిత్, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ మురహరి విజయ్ నియామక పత్రాలు అందించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు కొనకటి నవీన్‌రెడ్డి, నాయకులు నూకల కృష్ణ, వడ్లకొండ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తిహవేలికి చెందిన గొర్రె యాదగిరి (44) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా.. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని యాదగిరి భార్యను కోరగా నిరాకరించింది. దీంతో ఆయన గురువారం ఇంట్లో పురుగుల మందు తాగి పడుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

వంచనగరిలో..

వంచనగిరికి చెందిన బాషబోయిన శ్రీనివాస్ (48) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా.. శ్రీనివాస్‌కు 15 ఏళ్ల క్రితం దీక్షకుంట్లకు చెందిన మంజులతో జరిగింది. సంతానం కలగకపోవడంతో గత ఏడాది మంజుల విడాకులు తీసుకుంది. దీంతో శ్రీనివాస్ మనోవేదనతో తాగుడుకు బానిసయ్యాడు. గురువారం పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్చారు. శ్రీనివాస్ చికిత్స పొందుతూ అదేరోజు మృతి చెందాడు. మృతుడి సోదరి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివి



నెక్కొండ: నివాళులర్పిస్తున్న రంజిత్‌రెడ్డి, నాయకులు



గీసుకొండలో..



దుగ్గొండిలో..



రాయపర్తిలో..

సాక్షి నెట్‌వర్క్ : భారతదేశ మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ సేవలు మరువలేనివని ఆ పార్టీ నాయకులు కొనియాడారు. జిల్లాలోని నెక్కొండ, దుగ్గొండి, గీసుకొండ, ఖానాపురం, చెన్నారావుపేట, సంగెం, రాయపర్తి, నల్లబెల్లి, తదితర మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మన్మోహన్ సింగ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నెక్కొండలో టీపీసీసీ అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, గీసుకొండలో ఆ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి కొమురారెడ్డి, దుగ్గొండిలో నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, రాయపర్తిలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యా నాయక్ మాట్లాడారు. ప్రధానిగా మన్‌మోహన్‌సింగ్ దేశానికి ఎనలేని సేవలు అందించారని తెలిపారు. మన్‌మోహన్‌సింగ్ మృతి తీరని లోటన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



నల్లబెల్లి : మండలంలోని రేలకుంట, రుద్రగూడెం గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై గోవర్ధన్ వివరాలు వెల్లడించారు. అమ్మకానికి సిద్ధంగా ఉన్న 24 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రేలకుంటకు చెందిన హలావత్ సమ్మయ్య, రుద్రగూడెం శివారు చిన్నతండాకు చెందిన గుగులోత్ కేక్యాలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన గోడ

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన కొండేటి రవి ఇంటి గోడ శుక్రవారం కుప్పకూలింది. ప్రమాద సమయంలో దంపతులతోపాటు వారి ఇద్దరు పిల్లలు ఇంట్లోనే ఉన్నారు. ఎవరికీ ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. మూడో డివిజన్ కౌన్సిలర్ కొండేటి అనిత సత్యం కూలిన గోడను పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నెక్కొండ : ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బంజరుపల్లి జీపీ పరిధిలోని ధర్మతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. తండాకు చెందిన బాదావతు వీరన్న ఈనెల 12న రాత్రి తన పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వీరన్నను నర్సంపేటలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే పింఛన్ పెంపు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



మహిళలతో మాట్లాడుతున్న దయాకర్‌రావు

రాయపర్తి : గతంలో రూ.200గా ఉన్న పింఛన్‌ను బీఆర్ఎస్ హయాంలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.2 వేలకు పెంచామని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. వృద్ధుల పింఛన్ రూ.4 వేలకు పెంచుతామన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలిచాక విస్మరించిందని ఆయన చెప్పారు. చలికాలం నేపథ్యంలో మండలంలోని గట్టికల్‌లో పలువురు వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులకు శుక్రవారం ఆయన దుప్పట్లు పంపిణీ చేసి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు గుప్పించి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చి మోసపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసుగు చెందారని చెప్పారు. అనంతరం శివరామపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఆ పార్టీ మండల నాయకుడు నాగపురి సోమయ్యను దయాకర్‌రావు పరామర్శించారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహనాయక్, జిల్లా నాయకుడు బిల్లా సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, ఆకుల సురేందర్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, చిన్నాల లక్ష్మినారాయణ, బద్దం వేణుగోపాల్‌రెడ్డి, సంతోశ్‌గౌడ్, బాషబోయిన సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘డివైడర్ల కూల్చివేతపై నిర్లక్ష్యం సరికాదు’



నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

వర్ధన్నపేట : పట్టణంలో డివైడర్ల కూల్చివేతపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని అఖిలపక్ష నాయకులు అన్నారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు పట్టణంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ కూల్చివేతలు చేపడితే సహించేది లేదన్నారు. రాత్రికి రాత్రే అక్రమంగా డివైడర్లను కూల్చివేసినా బాధ్యులపై చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. రెండో వార్డు కౌన్సిలర్ తోటకూరి రాజమణి మాట్లాడుతూ కౌన్సిలర్లకు కూడా సమాచారం ఇవ్వడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. కమిషనర్‌ను వివరణ కోరితే పొంతన లేని సమాధానం చెబుతూ దాట వేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించకుంటే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, కౌన్సిలర్ కొండేటి అనిత సత్యం, బీజేపీ పట్టణ అధ్యక్షుడు పెద్దూరి రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కొండేటి శ్రీనివాస్, సీనియర్ నాయకులు సిలువేరు కుమారస్వామి, తుమ్మల యాకయ్య, వసంత్ నాయక్, ఎల్లయ్య, రాజు, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి

పట్టణంలోని జాతీయ రహదారి మధ్యలో నిర్మించిన డివైడర్‌ను ధ్వంసం చేసిన ఘటనపై కేసు నమోదు చేయాలని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్ఎస్‌పీ) జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. డివైడర్‌ను తొలగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. డివైడర్‌ను యదావిధిగా తక్షణమే నిర్మించకపోతే ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

ఆర్థికసాయం

చెన్నారావుపేట : సిద్ధార్థ స్కూల్ ఉపాధ్యాయుడు జక్కుల జగదీశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆ పాఠశాలలో 2009–10 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం రూ.31 వేల 500 సాయంగా అందజేశారు. తొలుత జగదీశ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మధు, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద యూత్ ఆధ్వర్యంలో..

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లికి చెందిన చెనబోయిన కుమార్ తల్లి, రాజు నాన్నమ్మ వీరమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో రూ.5 వేల సాయం అందించారు. తొలుత బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు ముద్రబోయిన శ్రీనివాస్, అధ్యక్షుడు ముప్పిడి మహేశ్, సభ్యులు వెంకటమల్లయ్య, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
9951602875 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944